క్లుప్తంగా

22న బహిరంగ వేలాలు

ఆదోని టౌన్: పట్టణంలోని ఝాన్సీలక్ష్మీబాయి కూరగాయల మార్కెట్‌కు సంబంధించి 2025-26 సంవత్సరానికి గానూ ఈనెల 22వ తేదీన ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ వేలంపాటను దక్కించుకున్న వారికి 01-04-2025 నుంచి 31-03-2026 వరకు సుంకం వసూలు చేసుకునేందుకు హక్కు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని రెవెన్యూ విభాగంలో అధికారులను సంప్రదించాలని సూచించారు.

టీబీపై అప్రమత్తంగా ఉండాలి

ఆదోని టౌన్: టీబీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వ్యాధి లక్షణాలను తెలుసుకోవాలని వైద్యాధికారులు షేకున్‌బాను, మహేష్ బాబు, పృథ్వీరాజ్, సనాజ్‌బేగం అన్నారు. మంగళవారం పట్టణంలోని శంకర్‌నగర్, ఇందిరానగర్, హవన్నపేట ప్రజలకు టీబీపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, దగ్గులో రక్తపుచారలు, ఆకలి తగ్గిపోవడం, బరువు తగ్గిపోవడం, ఉదయం, సాయంత్రం జ్వరం ఉంటే వెంటనే ప్రజలు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి గల్ల పరీక్ష, ఎక్స్‌రే పరీక్షలు ఉచితంగా చేయించుకోవాలన్నారు. వ్యాధి నిర్ధారణ అయితే ఉచితంగా మందులు, ప్రతినెలా రూ.500 చొప్పున ఆరు నెలలపాటు ఇస్తారన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాబురాజు, సుబ్బమ్మ, లలితమ్మ, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల విరాళం



ఆశ్రమానికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: మంత్రాలయం మండలంలోని రచ్చుమరి గ్రామానికి చెందిన సునీత తన భర్త అజయ్ వర్ధంతి సందర్భంగా పట్టణంలోని పూలే అంబేడ్కర్ ఎడ్యుకేషనల్ సొసైటీ అనాథ ఆశ్రమానికి మంగళవారం నిత్యావసర సరుకులు, విద్యార్థులకు నోటుపుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ నిర్వాహకులు ప్రతిభా భారతి, నరసన్న తదితరులు పాల్గొన్నారు.

పూడికతీత పనుల పరిశీలన

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో కమిషనర్ ఎం.కృష్ణ, మేస్త్రీలు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్లు కలియ తిరిగారు. శక్తిగుడి, బోయగేరి, వడ్డేగేరి, వాల్మీకి నగర్, టీజీఎల్ కాలనీ, మరాఠీగేరి, మదీనా కాలనీవీధి తదితర ప్రాంతాల్లో కమిషనర్ పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. మరాఠీగేరి వీధిలో ఓ కల్వర్టు కింద పేరుకుపోయిన చెత్తాచెదారం, పూడిక, కొబ్బరి బోండాల తీసివేత పనులను కమిషనర్ దగ్గరుండి పర్యవేక్షించారు.

పని భారం తగ్గించాలి

నందవరం : పంచాయతీ కార్యదర్శులకు పని భారం తగ్గించాలని మండల పంచాయతీ కార్యదర్శులు విజయలక్ష్మి, పెద్దిరెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులపై పని భారం, వత్తిడి తగ్గించాలని కోరుతూ ఎంపీడీఓ పుల్లయ్యకు సెక్రటరీలు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ..మండలంలో ఒక వైపు పంచాయతీ పరిపాలన విధులు, మరో వైపు సచివాలయ పనులు, అలాగే సర్వే, సమావేశాలంటూ కార్యదర్శులపై పని ఒత్తిడి పెంచారన్నారు. పని భారంతో అనారోగ్యం పాలవుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నౌసన్న, రామారావు, సుజాత, జ్యోతి, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

పదోన్నతి ఛానల్ ఏర్పాటు చేయాలి

పెద్దకడబూరు : గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు పదోన్నతి ఛానల్‌ను ఏర్పాటు చేయాలని ఇంజినీర్స్ అసోసియేషన్ మండల కార్యదర్శి రంగన్న కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం పంచాయతీరాజ్ ఏఈ మల్లయ్యకు వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ అసిస్టెంట్లను ఇంజినీరింగ్ శాఖకు కేటాయించి పదోన్నతులకు మార్గం సుగమం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామ ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు రాజు, ఉరుకుందు, శ్రావణి, మైత్రి, మాధవీలత, భీమరాయుడు తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేలో వివాదాలకు తావివ్వొద్దు

హొళగుంద: వివాదాలకు తావివకుండ రీ సర్వే చేపట్టాలని ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్ సూచించారు. మండలంలో రీ సర్వే పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎన్నికైన పెద్దహ్యాట గ్రామంలో జరుగుతున్న రీ సర్వే ప్రక్రియను మంగళవారం పరిశీలించారు. సర్వే ఏ మేరకు జరుగుతుంది, సమస్యలు, ఇతర అంశాలపై ఇన్‌చార్జ్ తహసీల్దారు నిజాముద్దీన్, సర్వేయర్ డీటీ ముకుందరావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ వేణుసూర్య, మండల ఇన్‌చార్జ్ సర్వేయర్ శ్రీనివాసనాయక్‌తో పాటు సంబంధిత అధికారులతో చర్చించారు. పనుల్లో నిర్లక్ష్యం, అలసత్వం వహించకుండా ఇచ్చిన లక్ష్యాన్ని చేరుకోవాలని సూచించారు. అనంతరం లింగంపల్లి గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు.

సచివాలయ సేవలు దూరం!

- సచివాలయాల విలీనానికి చర్యలు
- నివేదికలు తయారు చేస్తున్న అధికారులు
- సగానికి తగ్గనున్న సచివాలయాలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు



పెద్దనేలటూరు గ్రామ సచివాలయం

గోనెగండ్ల: గ్రామాల్లోనే ప్రజలకు అన్ని రకాల సేవ లు అందించాలనే మంచి ఆశయంతో గ్రామ స్వరాజ్య సాధన దిశగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చింది. దీంతో గ్రామాల్లో 530 రకాల సేవలు సకాలంలోనే అందుతుండేవి. ప్రజలు మండల కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా పాలన గడప వద్దకు చేరింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేసే దిశగా అడుగులు వేస్తోంది. కూటమి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల వల్ల పల్లె ముంగిట ప్రభుత్వ సేవలు దూరం కానున్నాయి.

సచివాలయాల కుందింపుపై కసరత్తు

మండలంలో 23 సచివాలయాలు ఉన్నాయి. రెండు సచివాలయాలను కలిపి ఒక సచివాలయంగా ఏర్పాటు చేసేందుకు అధికారులు క్షేత్రస్థాయిలో కసరత్తు చేస్తున్నారు. విలీనం అయితే సగానికి తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే ఎంపీడీఓలు, కార్యదర్శులు సచివాలయాల కుదింపు ఎలా చేయాలనే దానిపై విస్తృతంగా చర్చిస్తున్నారు. రెండు సచివాలయాలు ఉన్న చోట ఒకటి చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల ఒక్కో గ్రామానికి సచివాలయాలు ఏర్పాటయ్యాయి. వాటిని సమీపంలోని మరో సచివాలయానికి అనుసంధానం చేయనున్నారు. దీంతో కొన్ని చోట్ల సచివాలయాలు లేకుండా చేసే అవకాశం ఉంది. దీంతో ప్రజలు సేవల కోసం సుదూర వెళ్లాల్సి వస్తుంది. అలాంటి వాటిని ఎలా చేయాలనే దానిపై అధికారులు ఆలోచన చేస్తున్నట్లు తెలుస్తోంది.

తగ్గనున్న ఉద్యోగుల సంఖ్య

సచివాలయాల్లో 11మంది ఉద్యోగులు ఉన్న చోట వారిని ఇతర ప్రాంతాలకు బదిలీ చేసి కుదించే చర్యలు జరుగుతున్నాయి. వెల్ఫేర్, డిజిటల్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వీఆర్‌ఓ, కార్యదర్శి, వ్యవసాయం, వెటర్నరీ, ఏఎన్‌ఎం, మహిళా పోలీస్ తదితరులు విధులు నిర్వహిస్తున్నారు. ఈ ఉద్యోగుల్లో ప్రధానంగా వెల్ఫేర్, వీఆర్‌ఓ, కార్యదర్శి, డిజిటల్ అసిస్టెంట్‌తో మొత్తం తొమ్మిది మంది మాత్రమే పనిచేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. మిగిలిన ఉద్యోగులు ఆయా శాఖలకు బదలాయింపు చేసేందుకు కసరత్తు చేస్తున్నారు.

ప్రజలకు తప్పనితిప్పలు

సచివాలయాలను విలీనం చేయనుండడంతో వివిధ రకాల సేవలకోసం ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తుంది. ఉన్న ఊర్లలోనే సేవలు పొందే గ్రామస్తులు ఇకపై వేరే ఊర్లకు వెళ్లాల్సిన పరిస్థితులు త్వరలో ఏర్పడనున్నాయి. కనీసం నాలుగైదు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తుంది. పనులు మానుకొని సచివాలయాలకు వెళ్లినా అక్కడ సిబ్బంది ఉంటారా.. లేక ఫీల్డ్ విజిట్ అంటూ కనిపించకుండా పోతారా తెలియని పరిస్థితి నెలకొంటుంది. గత ప్రభుత్వ హయంలో ఉన్న ఊర్లలోనే పనులు చేసుకుని తీరిగ్గా సచివాలయాల్లో సేవలు పొందే వాళ్లమని అభిప్రాయ పడుతున్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు



బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకులో నీటిని పరిశీలిస్తున్న కమిషనర్, ఎంఈ, డీఈలు

ఆదోని టౌన్: మున్సిపాలిటీలో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ బోయ శాంత, కమిషనర్ ఎం.కృష్ణ తెలిపారు. మంగళవారం కమిషనర్ ఆధ్వర్యంలో బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకును పరిశీలించారు. తుంగభద్ర దిగువ కాలువ నుంచి పంపింగ్ చేస్తున్న రా వాటర్, చెరువులో ఉన్న నీటి నిల్వను పరిశీలించారు. కమిషనర్, చైర్‌పర్సన్ మాట్లాడుతూ.. బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకులో 80 రోజులకు సరిపడే నీటి నిల్వ ఉన్నాయని, రాంజల నల్లచెరువులో 40 రోజులకు సరిపడేంత నీటి నిల్వ ఉందన్నారు. నెలాఖరిలోగా ఎల్లెల్సీ కెనాల్‌లో రా వాటర్ పంపింగ్ నిలిపి వేస్తారని, అంతలోపు బసాపురం ఎస్‌ఎస్ ట్యాంకు, రాంజల నల్లచెరువులో పట్టణానికి సరిపడా నీటిని నింపుతామని చెప్పారు.




కాళ్లకు కర్రలు కట్టుకుని పాదయాత్రగా వెళ్తున్న కర్ణాటక భక్తుడు,పాదయాత్రగా వెళ్తున్న భక్తులు

వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేర కు నియోజకవర్గ పరిధిలోని ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండల కమిటీల జాబితాలను కేంద్ర కార్యా లయం విడుదల చేసింది. ఈ మేరకు ఆయా మండలాల కమిటీల వివరాలను పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక మంగళవారం వెల్లడించారు. ఇప్పటికే ఆయా మండలాలకు అధ్యక్షుల నియామకాలు పూర్తికావడంతో కమిటీల్లో మిగిలిన వాటిని భర్తీ చేసినట్లు తెలిపారు

ఎమ్మిగనూరు మండల కమిటీ: ఉపాధ్యక్షులుగా కె.రంగస్వామి, ఆర్.వేణుగోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా జి.వెంకట్రామిరెడ్డి, గడ్డం తిక్కన్న, బి.హనుమంతు, ఎస్.లోకన్న కార్యదర్శులుగా కేవై లింగన్న, గోవిందు, పెద్దయ్య, జి.ప్రకాశం, బోయ శ్రీను, కోశాధికారిగా జి.నాగభూషన్‌రెడ్డిలతో పాటు 13మంది ఎక్జిక్యూటీవ్ మెంబర్లుగా నియమితులయ్యారు.

గోనెగండ్ల మండల కమిటీ: ఉపాధ్యక్షులుగా పేట అల్లబకాష్, కటికె దాదాసాబు, ప్రధాన కార్యదర్శులుగా బింగి పెద్దలింగన్న, బోయశ్రీనివాసులు, కడపల ఉరుకుందు, వి.శ్రీనివాసులు, కార్యదర్శులుగా మల్లేష్, ఎస్.నాగేష్, రాముడు, కె.గోవిందు, బోయ రాముడు కోశాధికారిగా నాగార్జున రెడ్డిలతో పాటు 12మంది ఎక్జిక్యూటివ్ సభ్యులను నియమించారు.

నందవరం మండల కమిటీ: ఉపాధ్యక్షులుగా జి.రాఘవరెడ్డి, కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శులుగా బోయ బజారి.కె.రాముడు, ఎం.రెడ్డి శ్రీనివాసరెడ్డి, జగన్నాథరెడ్డి, కార్యదర్శులుగా రాఘవేంద్రారెడ్డి, కృష్ణమూర్తి, చుక్కామల్లేష్, బి.వెంకటేష్, నరసింహ రెడ్డి, కోశాధికారిగా ప్రభాకర్‌లతో పాటు 13మంది సభ్యులను నియమితులయ్యారు.

శ్రీశైలానికి కన్నడిగుల పాదయాత్ర



అన్నదాన శిబిరంలో సేదతీరుతున్న భక్తులు

కోసిగి: గత మూడు రోజులుగా కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తులు మండల కేంద్రం కోసిగి మీదుగా శ్రీశైలం భ్రమరాంబామల్లికార్జున స్వామిల దర్శనార్థం వేలాదిగా పాదయాత్రగా తరలి వెళ్తున్నారు. మంగళవారం వేకువజామున నుంచి అత్యధిక సంఖ్యలో యువకులు, మహిళలు, పెద్దలు వెళ్లారు. కొందరు మొక్కుబడిగా రెండు, మూడు అడుగుల కర్రలను కాళ్లకు కట్టుకుని నడుస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలోని శిరుగుప్ప, సింధనూరు, గదగ్, కొప్పల్, ధార్వాడ, జమ్మండి శివమొగ్గ, శిరువార్ తదితర ప్రాంతాల నుంచి వీరు పాదయాత్రగా వస్తున్నారు. ఈనెల 14న పాల్గుణ శుద్ధ పౌర్ణమి రోజున తమ ఇళ్లలో భ్రమరాంబామల్లికార్జున స్వామిలకు ప్రత్యేక పూజలు నిర్వహించి బయలు దేరినట్లు భక్తులు తెలిపారు. దాదాపు 750 కిలో మీటర్లు మేరకు పదిహేను రోజు పాటు పాదయాత్రగా శ్రీశైలంకు చేరుకోనున్నట్లు వెల్లడించారు. ఈనెల 30వ తేదీన ఉగాది పర్వదినానికి అక్కడికి చేరుకుని స్వామి, అమ్మవార్ల దర్శనం చేసుకోనున్నట్లు వారు తెలిపారు.

భక్తుల సేవలో..

భక్తులకు ఇబ్బందులు లేకుండా ఆంధ్ర ప్రాంతంలో అడుగడుగన సేవా దృక్పథంతో భోజన వసతి, తాగునీటి వసతి, సేద తీర్చేందుకు షెడ్లు సైతం ఏర్పాటు చేశారు. కోసిగి మండలంలో ఆర్లబండ, కొల్మాన్‌పేట, దుద్ది, ఉరుకుంద ఆర్చ్, రైల్వే గేటు సిద్ధరూఢ మఠం, కుర్డి నాగరాజు కాంప్లెక్స్, చైతన్య స్కూల్, రంగప్ప గట్టు డి.బెళగల్ ప్రాంతాలల్లో అన్నదాన కేంద్రాలు ఏర్పాటు చేశారు.

అక్రమ అరెస్టు దారుణం

గోనెగండ్ల : డప్పు కళాకారులు తమ సమస్యలు పరిష్కారించాలని కోరుతూ విజయవాడ ధర్నాచౌక్‌లో చేపట్టిన ధర్నాలో పాల్గొన్న అనంతరం మధ్యాహ్న భోజనానికి వెళ్తున్న వారిని అక్రమ అరెస్టు చేయడం దారుణమని డప్పు కళాకారుల సంఘం జిల్లా కార్యదర్శి కరుణాకర్ అన్నారు. మంగళవారం గోనెగండ్లలో డప్పు కళాకారులతో కలిసి నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ.. అరెస్టు చేసిన వారిని వెంటనే విడుదల చేసి డప్పు కళాకారుల సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మారేష్, మునెప్ప, రంగస్వామి, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

అవినీతి సొమ్ము చెల్లించకపోతే క్రిమినల్ కేసులు



సామాజిక తనిఖీ బహిరంగ సభలో అధికారులు

పెద్దకడబూరు : ఉపాధి హామీ పనులలో జరిగిన అవినీతి సొమ్మును 15 రోజుల్లో కట్టకపోతే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని పీడీ వెంకటరమణయ్య, ఏపీడీ మాధవీలత హెచ్చరించారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగరాజుస్వామి అధ్యక్షతన, ఎస్‌ఆర్‌పీ విజయభాస్కర్ ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 2023 నుంచి ఏప్రిల్ 2024వరకు మండలంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన 717 పనులకు రూ. 8.16కోట్లు ఖర్చు చేశామన్నారు. వాటిలో రూ.3.15 లక్షల వరకు అవినీతి జరిగినట్లు తేలిందన్నారు. వాటితో పాటు సామాజిక తనిఖీలో సరైన ఆధారాలు చూపని వారికి రూ. 93వేలు జరిమానా విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈపీఓ లోకేశ్వర్, ఏపీఓ చంద్రశేఖర్, పీఆర్ ఏఈలు ఖాదర్‌బాషా, మల్లయ్య సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి



అధికారులతో సమావేశం నిర్వహిస్తున్న సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

ఆదోని రూరల్: వేసవి ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలుగకుండా చర్యలు తీసుకోవాలని ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో తాగునీటి సరఫరా అంశాలపై ఎంపీడీఓలు, ఆర్‌డబ్ల్యూఎస్ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ వేసవికాలంలో తాగునీటి అవసరాలు పెరగనున్న దృష్ట్యా తగినన్ని చర్యలు ముందస్తుగా తీసుకోవాలని తెలిపారు. చెరువులు, బోర్లు, ఓపెన్ వెల్స్, వాటర్ ట్యాంకులు వంటి నీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో నీటి సరఫరా కొరత ఏర్పడితే తక్షణమే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని, దీనికి అవసరమైన ప్రణాళికను సిద్ధం చేయాలని ఆదేశించారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు

గ్రామంలో తాగునీటి సమస్యపై డివిజన్ స్థాయిలో కంట్రోల్ రూమ్ గ్రామీణ నీటి పారుదలశాఖ వారి కార్యాలయంలో ఏర్పాటు చేసినట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తితే 97046 43236, 78922 64314 నంబర్‌లకు ఫోన్ చేసి సమాచారమివ్వాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు పనులు చేపట్టాలి



వంకపై నిర్మించిన బ్రిడ్జికి అప్రోచ్ రోడ్డు నిర్మించాలంటున్న సీపీఎం నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని 16వ వార్డులో వంకపై నిర్మించిన బ్రిడ్జికి అనుసంధానంగా రెండు వైపులా అప్రోచ్ రోడ్డు నిర్మించి ఆప్రాంత వాసుల సమస్యను పరిష్కరించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి రాముడు డిమాండ్ చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని 16వ వార్డుతో పాటు ధోబీఘాట్, బైపాస్ రోడ్డు, తాయమ్మ కాలనీ, హబీబ్‌ముబారక్ నగర్‌లలో ప్రజా చైతన్య యాత్రలో భాగంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ బ్రిడ్జి నిర్మించారు కానీ, అప్రోచ్ రోడ్డు నిర్మించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. 40 సంవత్సరాల క్రితం ఈ ప్రాంతంలో వేసిన మంచినీటి పైప్‌లైన్ మార్చకపోవడంతో మంచినీటి ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు రాముడు, లక్ష్మీనర్సయ్య, రమేష్, నామాల రాముడు తదితరులు పాల్గొన్నారు.

మెనూ పాటించాలి

నందవరం : మధ్యాహ్న భోజనం నిర్వాహకులు మెనూ పాటించాలని ఎంఈఓ-2 రఘునాథ్ సూచించారు. మంగళవారం మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో ఎస్సీ కాలనీలోని ఎంపీపీ స్కూల్ మధ్యాహ్న భోజనం, రికార్డులు, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. భోజనంలో శుచి, శుభ్రతతో వండాలన్నారు. కాయగురలు, ఆకుకురలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఆదోని అర్బన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆదోని పవర్ హౌస్‌లో డీఈ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మీటర్ రీడర్స్ సమస్యలపై డీఈ హరికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు అజయ్‌బాబు మాట్లాడుతూ ఎన్నికల ముందు గత ప్రభుత్వం అమలు చేసిన స్మార్ట్ మీటర్లను కూటమి వ్యతిరేకించిందని, అధికారంలోకి వచ్చిన తర్వాత కూటమి ప్రభుత్వం అదే విధానాన్ని కొనసాగిస్తోందన్నారు. స్మార్ట్ మీటర్స్ విధానంతో రీడర్స్ రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఆదోని ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు వై.టి.భీమ్‌రాజ్, వెంకన్న, నాయకులు కల్లుబావి రాజు, దశరథ్, ఆదోని ఏపీఎస్‌ఎంఆర్ కార్యదర్శి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.



డీఈ హరికి వినతి పత్రం అందజేస్తున్న మీటర్ రీడర్స్, ఏఐటీయూసీ నాయకులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ మీటర్ రీడర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప, ఏపీ విద్యుత్ మీటర్ రీడర్స్ యూనియన్ జిల్లా నాయకులు నరసింహారెడ్డి, వీరేష్ డిమాండ్ చేశారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని ఏడీ ఈ నాగేంద్రప్రసాద్‌కు అందజేశారు. నాయకులు వీరశేఖర్, ఉరుకుందు, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి తిమ్మగురుడు, పట్టణ కార్యదర్శి విజయేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ నివేదికను ఆమోదించొద్దు



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న మాల మహానాడు జేఏసీ నాయకులు

ఆదోని రూరల్: ఎస్సీ వర్గీకరణ నివేదికను కూటమి ప్రభుత్వం ఆమోదించరాదని మాల మహానాడు జేఏసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆదోనిలోని డా.బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధమని, తప్పుడు నివేదికను ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వానికి ఇచ్చిన ఏకసభ్య కమిషన్ రాజీవ్‌మిశ్రా 2011 జనాభా లెక్కల ప్రకారం నివేదిక తయారు చేసి ఇవ్వడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. దీనిపై ఆంధ్రప్రదేశ్ కూటమి ముఖ్యమంత్రి కూడా క్షుణ్ణంగా పరిశీలన చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు చంద్రశేఖర్, వెంకటరాముడు, వీరన్న, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పట్టించుకోండి ప్లీజ్..!



పెద్ద కాలువలో పేరుకుపోయిన పూడిక

ఆదోని అర్బన్: పట్టణంలోని హర్దగేరి బస్టాండు ఎదురుగా పెద్ద కాలువలో పూడిక పేరుకుపోయింది. పలుమార్లు మున్సిపల్ కమిషనర్‌కు ఫోన్ ద్వారా, నేరుగా విన్నవించినా పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పూడిక పేరుకుపోవడంతో నీరు పైకి వస్తున్నాయని, దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నామని, ఇప్పటికైనా మున్సిపల్ కమిషనర్ స్పందించి పూడికను తీసి వేయించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

21న పంచాయతీ వేలాలు

కోసిగి: మేజర్ పంచాయతీ పరిధిలోని వారపు సంత మార్కెట్, బండిమెట్ట, చిన్న కమేళా, పెద్ద కమేళాకు సంబంధించిన వేలాలను ఈనెల 21న పంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ అయ్యమ్మ అధ్యక్షతన నిర్వహిస్తున్నట్లు పంచాయతీ ఈఓ తిరుమలేశ్వర రెడ్డి మంగళవారం తెలిపారు. 1-4-2025 నుంచి 31-03-2026 వరకు హక్కులు పొందేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్నవారు అదే రోజు ముందుగా వారపు సంత మార్కెట్, బండి మెట్టకు రూ.50వేలు డిపాజిట్, రూ.2లక్షల ఆస్తి సరిఫికెట్, చిన్న కమేళా, పెద్ద కమేళాకు రూ. 5వేలు డిపాజిట్, రూ.25వేల ఆస్తి సర్టిఫికెట్ సమర్పించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.